క్లుప్తంగా

33 శాతానికి మించితే.. పంట నష్టం నమోదు



నకరికల్లు: అకాల వర్షాలకు, ఈదురు గాలులకు 33 శాతానికి మించి పంట నష్టం వాటిల్లిన రైతుల వివరాలు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.సురేష్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీ, వ్యవసాయ సిబ్బందితో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాస్తవ సాగుదారుని వివరాలు ఈ నెల 30వ తేదీ లోగా నమోదు చేయాలన్నారు. నమోదు చేసిన జాబితాను సోషల్ ఆడిట్ కోసం సచివాలయం, రైతు భరోసా కేంద్రాల్లోని నోటీసు బోర్డుల్లో ప్రదర్శించాలని సూచించారు. సోషల్ ఆడిట్ ప్రక్రియ ఏప్రిల్ 1వ నుంచి 3వ తేదీలోగా పూర్తి చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. ఒక రైతుకు 5 ఎకరాలకు మించకుండా పంట నష్టం ఉండాలన్నారు. అన్ని రకాల పంటలకు పరిహారం వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న కృష్ణ కాంస్య విగ్రహం




సత్తెనపల్లి: దివంగత సినీ నటుడు, సూపర్ స్టార్ కృష్ణ కాంస్య విగ్రహావిష్కరణకు సత్తెనపల్లిలోని కృష్ణ, మహేష్ బాబు అభిమానుల ఆధ్వర్యంలో చురుకుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే పశ్చిమ గోదావరి జిల్లా, సత్తా రామేశ్వరంలోని ఏకే ఆర్ట్స్‌లో కృష్ణ కాంస్య విగ్రహం (జమ దగ్గి చిత్రంలోని రూపం) 7.52 అడుగుల్లో రూపుదిద్దుకొంది. ఈ విగ్రహం ఆయన అభిమానులను ఆకట్టుకుంటోంది. సత్తెనపల్లిలోని పార్క్ రోడ్డులో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సహకారంతో త్వరలోనే కృష్ణ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు అభిమాన సంఘ నాయకుడు, న్యాయవాది మర్రి వెంకటసుబ్బారెడ్డి, రంగారావు తెలిపారు.

తహసీల్దార్‌పై వాచ్‌మెన్ ఫిర్యాదు



సత్తెనపల్లి: తాహసీల్దార్ కటకం నగేష్‌పై కార్యాలయ వాచ్‌మెన్ షేక్ సాయిబా సాహెబ్ గురువారం సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమారికి ఫిర్యాదు చేశాడు. తాహసీల్దార్ కార్యాలయంలో నైట్ వాచ్‌మెన్‌గా చేస్తున్న తనతో తహసీల్దార్ నగేష్ మూడు నెలల నుంచి అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నారని, కొద్దిరోజుల నుంచి ఇది మరీ ఇబ్బంది కరంగా మారిందని పేర్కొన్నాడు. అదేమంటే సస్పెండ్ చేస్తానని బెదిరిస్తున్నారని చెప్పారు. తనకు షుగర్ ఉందని, మానసికంగా తాను, తన కుటుంబం ఒత్తిడికి లోనవుతున్నట్లు వాపోయాడు. రెండు ఇంక్రిమెంట్లు కూడా వేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని, న్యాయం చేయాలని ఆర్డీఓను వేడుకొన్నాడు. దీనిపై తాహసీల్దార్ నగేష్‌ను ఆర్డీఓ రాజకుమారి విచారించారు. వ్యక్తిగతంగా తాను దూషించలేదని, కార్యాలయ తాళాలు ఉప తహసీల్దార్‌కు అందించడం, కార్యాలయం శుభ్రంగా ఉంచుకోవడం వాచ్‌మెన్ బాధ్యతని సమాధానం ఇచ్చారు.

పోషణ పక్వాడాపై అవగాహన



నాగవరం(క్రోసూరు): నాగవరం గ్రామంలో గురువారం జెడ్పీ ఉన్నత పాఠశాల కిషోర బాలికలకు పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల అనర్థాలు, పౌష్టికాహారం, తృణ ధాన్యాల ప్రయోజనాలను వివరించారు. సూపర్ వైజర్ రత్నకుమారి అవగాహన కల్పించారు. బాలికలకు సమస్యలు ఎదురైతే.. 1098, 181 కాల్ సెంటర్‌కు తెలియజేయాలన్నారు. పాఠశాల హెచ్ఎం సుధాకర్ తృణ ధాన్యాల గురించి వివరించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం చైతన్య, ఎంఎల్‌హెచ్‌పీ శివపార్వతి, అంగన్వాడీ వర్కర్లు దీనకుమారి, ధనలక్ష్మీ, దేవకుమారి, సిరాజిని, ఆశా వర్కర్లు విజయలక్ష్మీ, అంజమ్మ పాల్గొన్నారు.

అన్నట్టుగానే.. ఆసరానిచ్చేందుకు..

- వైఎస్ఆర్ ఆసరా లబ్ధిదారుల జాబితా సిద్ధం
- ఇప్పటికే రెండు విడతల్లో రూ.126.8 కోట్ల లబ్ధి
- ఈ నెల 25న లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.69.46 కోట్లు



ధూళ్ళిపాళ్లలో లబ్ధిదారులకు బొట్టుపెట్టి ఆసరా లబ్ధిని వివరిస్తున్న సిబ్బంది

సత్తెనపల్లి: మహిళా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అందులో ఒకటి వైఎస్సార్ ఆసరా. 2019 ఏప్రిల్ 11 నాటికి పొదుపు సంఘాలు తీసుకున్న రుణాలు మొత్తాన్ని నాలుగు విడతల్లో మహిళల ఖాతాలకు జమ చేస్తానని ప్రజా సంకల్ప యాత్రలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు విడతల్లో సొమ్ము చెల్లించి.. పొదుపు మహిళలకు అన్నగా..అండగా నిలిచారు. ప్రస్తుతం మూడో విడత నగదు ఈ నెల 25న బదిలీ చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో అర్హులైన మహిళల ఖాతాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నగదు బదిలీ చేస్తారని డీఆర్డీఏ, మెప్మా అధికారులు వెల్లడించారు. అర్హులైన లబ్ధిదారుల బయోమెట్రిక్ సేకరించడంతో తుది జాబితాను సిద్ధం చేశారు.

సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితా

సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో ఒక పట్టణం, తొమ్మిది మండలాలున్నాయి. మొదటి విడత రుణ మాఫీ కింద 8,566 స్వయం సహాయక సంఘాల్లోని 85,672 మహిళల ఖాతాల్లో రూ.68.74 కోట్లు, రెండో విడతలో 8,611 స్వయం సహాయక సంఘాల్లోని 86,122 మహిళల ఖాతాల్లో రూ.69.51 కోట్లు జమ అయ్యాయి. రెండు విడతల్లో కలిపి రూ.138.25 కోట్ల మేర మహిళలు లబ్ధి పొందారు. మూడో విడతలో 8,611 స్వయం సహాయక సంఘాల్లోని 86,112 మహిళలకు రూ.69.46 కోట్లు చెల్లించేందుకు డీఆర్డీఏ, మెప్మా అధికారులు ఏర్పాట్లు చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాను సిబ్బంది ఇప్పటికే ప్రదర్శించారు. ప్రస్తుతం ప్రీ లాంచింగ్‌లో భాగంగా సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి.. బొట్టు పెట్టి ఆసరా పథకం గురించి వివరిస్తున్నారు.

సామాజిక తనిఖీలతో సమస్యలకు చెక్...

వైఎస్సార్ ఆసరా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తోంది. ఆసరా సొమ్ము జారీలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా సచివాలయాల వద్ద సామాజిక తనిఖీ చేపట్టింది. అనంతరం లబ్ధిదారుల జాబితాను రూపొందించారు. ఎవరైనా సభ్యులు చనిపోయినా, నామిని వివరాలు సక్రమంగా లేకపోయినా వాటిని పరిష్కరించి, అర్హులకు సొమ్ము అందేలా జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు పూర్తి చేసింది. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం సంక్షేమాన్ని కొనసాగిస్తుందంటూ మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



స్వయం సహాయక సంఘాలకు ఆసరాపై అవగాహన కలిగిస్తున్న సిబ్బంది

3వ విడత 'ఆసరా'కు ప్రభుత్వానికి పంపిన వివరాలు

మండలం	సంఘాలు	సభ్యులు	రుణం (రూ.కోట్లలో)
సత్తెనపల్లి టౌన్	702	6,936	5.68
సత్తెనపల్లి రూరల్	1,318	13,192	10.93
ముప్పాళ్ళ	783	7,842	7.10
రాజుపాలెం	721	7,218	5.69
నకరికల్లు	1,055	10,558	8.53
పెదకూరపాడు	730	7,305	6.71
అమరావతి	1,229	12,297	11.24
అచ్చంపేట	976	9,774	6.57
క్రోసూరు	861	8,622	5.95
బెల్లంకొండ	236	2,368	1.04

స్వయం ఉపాధికి మార్గం



వైఎస్ఆర్ ఆసరా పథకం కింద మూడో విడత నగదు విడుదలకు ఏర్పాట్లు చేస్తున్నాం. బయోమెట్రిక్, సోషల్ ఆడిట్ అభ్యంతరాల పరిశీలన అనంతరం.. తుది జాబితా సిద్ధం చేశాం. మహిళలు ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోంది. వాటిని సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలి. ప్రభుత్వం ఇస్తున్న నగదు సాయానికి మరికొంత రుణాన్ని తీసుకొని స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలి.

– శిఖా కృపావేణి, ఇందిర క్రాంతి పథం, ఏపీఎం, సత్తెనపల్లి

రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న వైసీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి

బెల్లంకొండ: కందిపాడు గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి తిరునాళ్ల సందర్భంగా గురువారం రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చెన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించారు. మొదటి రోజు సీనియర్, ఆరు పళ్ల సైజు ఎడ్లకు పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆరు జతలు ఎడ్లు బల ప్రదర్శనలో సత్తాచాటాయి. శుక్రవారం నాలుగు పళ్ల, జూనియర్, సేద్యం విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజవర్గ నాయకులు వడ్డే కృష్ణారెడ్డి, రవి చౌదరి, మండల పార్టీ నాయకులు చింతారెడ్డి సాయిరెడ్డి, గ్రామ సర్పంచ్ కంభంపాటి పాప, ప్రకాష్, ఎంపీటీసీ రేగులగడ్డ తిరుపతమ్మ, శ్రీనివాసరావు, మర్రి చంద్రారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



జ్వర సర్వేను పరిశీలిస్తున్న మలేరియా అధికారి ప్రభాకర్‌రెడ్డి

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఇరుకుపాలెం గ్రామం ఎస్సీ కాలనీని గురువారం ఆయన సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న ఫీవర్ సర్వేను పరిశీలించారు. కాలనీలోని గృహాలను సందర్శించి, తొట్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. మురుగు కాల్వలను శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను బయట వేయకుండా పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఏఎన్ఎం శాంతకుమారి, ఆశ కార్యకర్తలు విజయకుమారి, రోజా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కంటెపూడిలో సినిమా షూటింగ్

సత్తెనపల్లి: మండలంలోని కంటెపూడి గ్రామంలోని శివాలయం ప్రాంగణంలో గురువారం శ్రీ గణేష్ దేవి మూవీ క్రియేషన్స్ బ్యానర్ పై రాయదుర్గం రమాదేవి రెడ్డి నిర్మాతగా కాశీ నగర్ 1947 చిత్రం పతాక సన్నివేశాలను చిత్రీకరించారు. చిత్ర నిర్మాణం శరవేగంగా పూర్తిచేసుకుంటున్నట్లు దర్శకుడు చిత్త జల్లు ప్రసాద్ తెలిపారు. కొన్ని పతాక సన్నివేశాలను హీరో దిలీప్ రాథోడ్, హీరోయిన్ ఆరోహి గడిగి, హీరోయిన్ తల్లి రాయదుర్గం రమాదేవి రెడ్డి లపై చిత్రీకరించామన్నారు. పట్టణంలోని ప్రగతి సీబీఎస్ఈ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ మక్కెన అచ్చయ్య చాంబర్ హాల్లో ఎస్పీ సన్నివేశాలను చిత్రీకరించినట్లు చెప్పారు. సత్తెనపల్లికి చెందిన వల్లెం చెన్నకేశవ ప్రతి నాయకుడి పాత్ర జగన్నాథ పట్నాయక్‌గా, ప్రముఖ న్యాయవాది మర్రి వెంకటసుబ్బారెడ్డి ఎస్పీగా నటించారని, హీరో స్నేహితుడిగా చిలకలూరిపేటకు చెందిన శివ, ప్రతి నాయకుడి ప్రధాన అనుచరుడిగా తిరుపతి తదితరులు నటించాడని దర్శక నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరామెన్ జి.కృష్ణ నాయుడు, సంగీతం లక్ష్మణసాయి, పాటలు జి.సీతారామ చౌదరి, కొరియోగ్రాఫర్‌గా బండ్ల రామారావు

రాహుల్ గాంధీ అరెస్ట్.. రాజకీయ కుట్రలో భాగం



మాట్లాడుతున్న మాదంశెట్టి వేదాద్రి, నాయకులు

సత్తెనపల్లి: రాహుల్ గాంధీపై సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పును యావత్ భారత దేశ ప్రజానీకం తీవ్రంగా ఖండిస్తోందని పీసీసీ డెలిగేట్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదం శెట్టి వేదాద్రి అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సూరత్ కోర్టు తీర్పు రాజకీయ కుట్రలో భాగమేనన్నారు. రాజకీయ విమర్శలను కూడా స్వీకరించలేని బీజేపీ ప్రభుత్వ మొండి వైఖరి దురదృష్టకరమన్నారు. 2019 సాధారణ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ గాంధీ కర్ణాటకలో ప్రసంగిస్తూ మోడి ఇంటి పేరు గల నీరవ్ మోడి తదితరుల ఆర్థిక నేరస్తులను విమర్శించినందుకు బీజేపీ ఎమ్మెల్యే తప్పుడు కేసు పెట్టారని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. దీని ద్వారా భారతదేశంలో ప్రజాస్వామ్యం ఏ స్థాయిలో ఉందో ప్రజలు, మేధావులు ఆలోచించాలన్నారు. సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞాన్‌రాజ్ పాల్, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జానీ ఖాజావలి, జెట్టి శేఖర్ పాల్గొన్నారు.

బయ్యవరంలో పల్లె నిద్ర

క్రోసూరు: మండలంలోని బయ్యవరం గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో పల్లె నిద్ర కార్యక్రమం గురువారం చేపట్టినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో పి.శివరామయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి పాఠశాలల్లో నాడు–నేడు పనులు పర్యవేక్షిస్తున్న వివిధ శాఖల ఇంజినీర్లతో సమీక్షించినట్లు చెప్పారు. శుక్రవారం గ్రామోదయం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 6.30గంటలకు జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ట్రాన్సాక్ట్ వాక్ జరుగుతుందన్నారు. మండలాధికారులు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ వర్కర్లు, ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొంటారని తెలిపారు.

నేడు హనుమాన్ చాలీసా పారాయణ

సత్తెనపల్లి: పట్టణంలోని నాగార్జున నగర్ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం 7 గంటలకు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందని నిర్వాహకులు గురువారం తెలిపారు. భక్తులకు అన్న ప్రసాదం వితరణ ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని, స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రంజాన్ మాసం ప్రారంభం

క్రోసూరు: ముస్లింల పవిత్ర రంజాన్ మాసం శుక్రవారం వేకువజాము నుంచి ప్రారంభవుతుందని జామియా మసీదు ఇమాం షేక్ జమాలుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల పొడపు చూడటంతో రంజాన్ మాసం ప్రారంభమైందన్నారు. రంజాన్ మాసం సందర్భంగా మండలంలోని అన్ని మసీదులు ముస్తాబయ్యాయి. ముస్లింలు నెల రోజుల ఉపవాస దీక్షలు చేపట్టి, ఐదు పూటలా నమాజులు అచరించి భక్తి మార్గంలో గడపుతారని ఇమాం తెలిపారు.

క్రీడా మైదానానికి మూడెకరాలు కేటాయింపు



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ విజయ ప్రతాప్‌రెడ్డి

అచ్చంపేట: చింతపల్లి, చెరుకుంపాలెం సచివాలయ పరిధిలో ఆర్ అండ్‌బీ రోడ్డు పక్కనే మూడు ఎకరాల స్థలాన్ని గ్రామస్తులు క్రీడా మైదానానికి కేటాయించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహకారంతో జెడ్పీటీసీ తుమ్మా విజయ ప్రతాప్‌రెడ్డి గురువారం అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో సరైన ఆట స్థలం లేకపోవడంతో క్రీడాకారులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా మైదానాన్ని తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ చింతగుంట్ల అనురాధ, హనుమంతరెడ్డి దంపతులు, గ్రామాభివృద్ధి సభ్యులు పాల్గొన్నారు.

భగత్ సింగ్‌కు ఘన నివాళి



భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న జేపీఎస్ శాస్త్రి

నకరికల్లు: దేశ స్వాతంత్ర్యం, బానిస సంకెళ్ల విముక్తి కోసం పోరాటం చేస్తూ అతి పిన్న వయసులో ప్రాణాలు విడిచిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ త్యాగం చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం నకరికల్లులో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీడీఎం జిల్లా సహాయ కార్యదర్శి షేక్.మస్తాన్‌వలి మాట్లాడుతూ బ్రిటిష్ కబంధ హస్తాల్లో బానిసలుగా బతుకుతున్న భారతీయుల విముక్తి కోసం పోరాటం చేసి ఉరి కంబం ఎక్కిన భరతమాత ముద్దుబిడ్డలని కొనియాడారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి జి.పిచ్చారావు, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కోటానాయక్, ఎంసీపీఐయూ జిల్లా మహిళా అధ్యక్షురాలు గాదె కుమారి, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్.సైదా, గోదా బాల, సీఐటీయూ మండల కార్యదర్శి గోదా చిన్ని, షేక్.మస్తాన్, వినుకొండ సుభాని. మార్తమ్మ, లాలూ తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ దేశభక్తి స్ఫూర్తి.. నేటి తరానికి అవసరం

సత్తెనపల్లి: భగత్ సింగ్ దేశభక్తి స్ఫూర్తి నేటి తరానికి అవసరమని యోగా సాధకుడు జేపీఎస్ శాస్త్రి అన్నారు. పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో గురువారం భగత్ సింగ్ బలిదాన దివస్‌లో ఆయన మాట్లాడారు. జేపీఎస్ శాస్త్రి మాట్లాడుతూ కేవలం 23 సంవత్సరాల వయసులోనే ఉరితాడును ముద్దాడిన గొప్ప దేశభక్తులు భగత్ సింగ్ అని కొనియాడారు. యోగ సాధకుడు వెంకటేశ్వర రావు దేశభక్తి గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వెంకటాద్రి అమరవీరుల చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవరశెట్టి రవికుమార్, సత్యనారాయణ, లక్ష్మయ్య, శ్రీనివాసరావు, పులహరి భాను, రమాదేవి, సునీల్, నగేష్ , న్యాయవాదులు ఇ.యల్లారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఈదురు గాలులు.. విరిగిన విద్యుత్ స్తంభాలు



విరిగిపడిన విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు



మాచర్ల రోడ్డులో నేలకొరిగిన భారీ వృక్షం

నకరికల్లు: నకరికల్లులో గురువారం భారీ ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా స్తంభించిపోయింది. ట్రాఫిక్ ఏర్పడింది. ఉరుములతో కూడిన వర్షం కురిసింది. రెండు రోజుల క్రితం వరకు ఈదురు గాలుల ప్రభావానికి నాలుగు రోజుల పాటు నకరికల్లులోని ప్రజలు అంధకారంలో గడిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించి ఒక్కరోజు గడవక ముందే మళ్లీ అదే పరిస్థితి ఏర్పడింది.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

సత్తెనపల్లి: మహిళ అదృశ్యంపై సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. భీమవరం గ్రామానికి చెందిన యంపోగు హనుమంతరావు భార్య యంపోగు రుతమ్మ, వయస్సు 53 సంవత్సరాలు. ఈ నెల 8న మధ్యాహ్నం ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని భర్త ఫిర్యాదులో పెర్కొన్నాడు. చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా కనిపించలేదని తెలిపాడు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



గొర్రెపాటి బాబు మృతదేహం

మాదల(ముప్పాళ్ళ): గుర్తు తెలియని వాహనం ఢీకొని.. ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మాదల సమీపంలో గురువారం జరిగింది. పోలీసులు వివరాల మేరకు.. పలు దేవర్లపాడు గ్రామానికి చెందిన గొర్రెపాటి బాబు(23) అనే యువకుడు సత్తెనపల్లిలో బిగ్‌సీ దుకాణంలో పనిచేస్తుంటాడు. పనులు ముగించుకొని తన ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో మాదల సమీపంలోని డెయిరీ వద్ద గుర్తు తెలియని వాహనం అతనిని ఢీకొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో బాబు పొట్ట వద్ద పెద్ద గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, బాబు ఉన్నాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై ఎం.పట్టాభి రామయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేర కేసు నమోదు చేశారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

నేడు బీజేపీ మండలాధ్యక్షుల ప్రమాణస్వీకారం

సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణం, వివిధ మండలాలకు బీజేపీ నూతన అధ్యక్షులుగా నియమింపబడిన వారి పదవీ స్వీకరణ, సన్మాన కార్యక్రమం ఈ నెల 24న శుక్రవారం ఉదయం 10 గంటలకు వేంకటేశ్వర కల్యాణ మండపంలో జరుగుతుందని నియోజకవర్గ ప్రజా పోరు 2 కన్వీనర్ పక్కాల సూరిబాబు గురువారం తెలిపారు. ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, సభాధ్యక్షుడిగా పల్నాడు బీజేపీ అధ్యక్షుడు ఆలోకం సుధాకర బాబు, విశిష్ట అతిథిగా జిల్లా బీజేపీ ఇన్‌చార్జి ఉమా మహేశ్వరరావు హాజరవుతారన్నారు. సన్మాన గ్రహీతలుగా పట్టణ బీజేపీ కమిటీ అధ్యక్షుడు మందడపు శ్రీనివాసరావు, రాజుపాలెం, నకరికల్లు మండలాధ్యక్షుడు కన్యదారి బాల చౌదరి, అనుమోలు శ్రీనివాసరావు ఉన్నారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

600 లీటర్ల నాటు సారా స్వాధీనం

- పరారైన ఐదుగురు నిందితులు
- తెలంగాణ నుంచి సరఫరా

మాచర్ల: వెల్దుర్తి మండలంలోని మారుమూల గ్రామం రామ చంద్రాపురంలో ఎస్ఈబీ అధికారులు గురువారం సాయంత్రం దాడులు నిర్వహించారు. 30 క్యాన్లలో నిల్వ ఉంచిన 600 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రెడ్డి మాచర్ల పట్టణంలోని పిడబ్ల్యూడీ కాలనీలో విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. తెలంగాణ ప్రాంతం నుంచి నాటు సారా అక్రమ రవాణపై సమాచారం మేరకు.. దాడులు చేశామన్నారు. రామచంద్రాపురం కృష్ణానది ఒడ్డున.. అటవీ ప్రాంతంలో తెలంగాణ ప్రాంతం నుంచి పుట్టీలలో నాటుసారా తరలించి, నిల్వ ఉంచిన 30 క్యాన్లను స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. ఐదుగురు దాడులకు వెళ్లిన సమయంలో పారిపోయారని, త్వరలోనే వారిని అరెస్టు చేస్తామని ప్రసాద్‌రెడ్డి తెలిపారు. విలేకరుల సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.